
బృందావన్‌కాలనీలో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఓపెన్ జోన్ సమస్య పరిష్కారానికి కృషి : సుధీర్‌రెడ్డి

కొత్తపేట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ బృందావన్‌కాలనీ ఓపెన్ జోన్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్‌తో కలిసి సమస్యలు ప్రత్యక్షంగా పరిశీలించడానికి కాలనీలో పాదయాత్ర చేశారు. కాలనీ ఓపెన్‌జోన్‌లో ఉండడంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నామని, రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్చాలని కాలనీవాసులు ఆయనకు విన్నవించారు. రెండు రోడ్లలో మాత్రమే డ్రైనేజీ సదుపాయం ఉందని దీంతో వర్షాల వేళ ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీలో ఓపెన్‌జోన్ సమస్యను పరిష్కరించాలని సంబంధిత మంత్రితో మాట్లాడానని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. డ్రైనేజీ వ్యవస్థను మిగతా ప్రాంతాల్లోనూ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని, అదనంగా విద్యుత్ స్తంభాలు, నూతన సీసీరోడ్ల నిర్మాణానికి సత్వర చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. నాయకులు ఇటికల యాదగిరి, యాసిన్, జోగు నాగేష్, కాలనీ ప్రతినిధులు రాకేష్, శేఖర్, దీపక్, యాదయ్య, ఉదయ్, హుస్సేన్ పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో అడిషనల్ డీఎంహెచ్‌వో పాపారావు, వైద్యులు

పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలి

- అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ పాపారావు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య మహిళ శక్తివంతమైన కుటుంబం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ ఆమని, నరేందర్, అన్నపూర్ణ, లక్ష్మీసుధ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలు, పురుషులకు బీపీ, షుగర్, థైరాయిడ్, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. సుమారు 153 మంది ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకున్నట్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ పాపారావు శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలో మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. అప్పుడే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన డాక్టర్లు, ఎంపీహెచ్‌ఏ, సూపర్‌వైజర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి

ఓపెన్ జిమ్‌లతో ఆరోగ్యం : కార్పొరేటర్ శ్వేతారెడ్డి

సైదాబాద్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఓపెన్ జిమ్‌లను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం సరస్వతీనగర్‌కాలనీ పార్కులో జీహెచ్‌ఎంసీ నిధులు రూ.6.86లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆమె ప్రారంభించారు. డివిజన్‌లో అన్ని పార్కుల్లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు ప్రభాకర్ రెడ్డి, చిన్నారెడ్డి, గున్న నర్సింహారెడ్డి, బుస్సా శ్రీనివాస్ పాల్గొన్నారు.


కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

ఓల్డ్‌మారుతీనగర్ సమస్యల పరిష్కారానికి చర్యలు

కొత్తపేట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఓల్డ్ మారుతీనగర్ సమస్యల పరిష్కారానికి చ్యలు తీసుకుంటామని స్థానిక కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన కాలనీలో పర్యటించారు. కాలనీ సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో ఉన్న పాత డ్రైనేజీ పైపులతో తరచూ సమస్యలు తలెత్తుతున్నాయని, ఎక్కువ సామర్థ్యం గల నూతన పైపులు వేయిస్తామన్నారు. ఇతర సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. నెల రోజుల లోపు నూతన పైప్‌లైన్లు వేసేలా చర్యలు తీసుకుంటామని జలమండలి ఏఈ స్రవంతిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు శివరామకృష్ణ, అంజన్‌కుమార్, బీజేపీ నాయకులు గట్టు మహేష్ కుమార్, తోట మహేందర్‌యాదవ్, శరణ్ పాల్గొన్నారు.

స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణానికి రూ.10కోట్లు


స్టాండింగ్ కమిటీ సమావేశంలో కార్పొరేటర్ సుజాతానాయక్

చంపాపేట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని ఏపీఎస్‌ఈబీ కాలనీలోని కల్వర్టు నుంచి పంచాయతీరాజ్ టీచర్స్‌కాలనీ కమాన్ వరకు స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణం కోసం రూ.10 కోట్లు మంజూరుకు బుధవారం నిర్వహించిన జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ప్రతిపాదనలు పెట్టినట్లు స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాతానాయక్ తెలిపారు. నిధుల మంజూరుకు మేయర్ విజయలక్ష్మి సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు. స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణంతో ముంపు సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

దిల్‌సుఖ్‌నగర్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు దిల్‌సుఖ్‌నగర్ మెట్రోస్టేషన్ వద్ద బుధవారం ఆందోళనకు దిగారు. తెలంగాణ బీఈడీ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నిరుద్యోగుల జేఏసీ నాయకుడు భూక్య కుమార్ ఆధ్వర్యంలో నిరుద్యోగులు పెద్దఎత్తున దిల్‌సుఖ్‌నగర్‌లో ర్యాలీ చేపట్టారు. అనంతరం దిల్‌సుఖ్‌నగర్ మెట్రోస్టేషన్ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి, ఆందోళనకు దిగడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పది రోజులుగా నిరాహార దీక్ష చేపడుతున్న అశోక్‌కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా భూక్య నాయక్ మాట్లాడుతూ 35వేల ఉద్యోగాలతో మెగా డీఎస్సీ విడుదల చేయడంతో పాటు, జీవో నెం. 108ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌జీటీలో ఇచ్చే ప్రమోషన్ కోటాను 70శాతం నుంచి 20శాతానికి తగ్గించాలన్నారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులను బీఈడీ అభ్యర్థులతో 80శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. భారీ ఎత్తున వాహనాలు నిలిచిపోవడంతో సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన కారులకు నచ్చజెప్పడంతో ధర్నా విరమించారు.


మాతమైదాన్‌లో విజయదుర్గామాతను దర్శించుకుంటున్న మహిళలు


అల్కాపురికాలనీ యూత్ అసోసియేషన్ అమ్మవారికి పూజలు చేస్తున్న దేప భాస్కర్‌రెడ్డి, సురేఖ దంపతులు


చంపాపేట డివిజన్‌లోని కుమ్మరిబస్తీలో దుర్గామాతకు పూజలు చేస్తున్న బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌కుమార్, కళ్యాణ్


హస్తినాపురం డివిజన్ డిఫెన్స్‌కాలనీలోని హరిహర క్షేత్ర అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఆలయ వ్యవస్థాపకుడు, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రోత్సవాలు

సైదాబాద్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సైదాబాద్, మాదన్నపేట, మలక్‌పేటల్లో భక్తిపారవశ్యంతో జరుగుతున్నాయి. అమ్మవారి ఆలయాలు, మండపాలు భక్తుల రాకతో పోటెత్తుతున్నాయి. పల్టన్‌లోని శ్రీహరిహర క్షేత్రం, కరన్‌బాగ్‌లోని మల్లికార్జున ఆలయం, సైదాబాద్ పెద్దతోటలోని భూలక్ష్మిఆలయంలో, మాదన్నపేట మార్కెట్‌లోని ఆలయంలో అమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. కుర్మగూడ ఆర్యసమాజ్, ప్రెస్‌కాలనీ, సింగరేణికాలనీ, మలక్‌పేట ఆనంద్‌నగర్, దయానంద్‌నగర్, ఎస్‌బీహెచ్ కాలనీల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరుతున్నారు.

మన్సూరాబాద్: నాగోల్‌లోని మహంకాళి ఆలయంలో ఏర్పాటు చేసిన మండపంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మహంకాళి ఆలయ కమిటీ, చండీశాక్త మండల్ సంయుక్తాధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన బుధవారం అమ్మవారు చంద్రఘంట అవతారంలో దర్శనమివ్వగా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


హయత్‌నగర్ డివిజన్ పద్మావతికాలనీలో దుర్గామాతను దర్శించుకుంటున్న కాలనీ సంక్షేమ సంఘం నాయకులు


కొత్తపేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

అమ్మవారికి 'దేప' దంపతుల పూజలు

ఎల్బీనగర్: ఆర్కేపురం డివిజన్ అల్కాపురికాలనీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ దేప సురేఖాభాస్కర్‌రెడ్డి దంపతులు బుధవారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గట్ల రవీంద్ర, దినేష్‌సింగ్, సత్యనారాయణ, పగడాల శ్రీశైలం, బొడ్డుపల్లి నగేష్, కళ్యాణ్‌యాదవ్, ప్రశాంత్, సాత్విక్, అనిల్, రాజు పాల్గొన్నారు.

హైడ్రాకు చేరిన ఎర్రకుంట అలుగు పంచాయితీ

- పరిశీలించిన హైడ్రా, ఇరిగేషన్ అధికారులు

హయత్‌నగర్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తొర్రూర్ ఎర్రకుంట అలుగు పంచాయితీ హైడ్రా అధికారులకు చేరింది. కొన్ని సంవత్సరాలుగా గ్రామంలో అలుగు పంచాయితీ నడుస్తుంది. ఒక వర్గం ఒక చోట, మరో వర్గం మరోచోట అలుగు ఉన్నట్లు చూపిస్తుండటంతో సమస్య జఠిలంగా మారింది. గ్రామానికి చెందిన చినింగి రాజ్‌కిరణ్, రాములుకు చెందిన వ్యవసాయ పొలం వద్ద అలుగు ఉందని అక్కడ ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డిల వాదన. తమ పొలం వద్ద అలుగు లేదని పాత రికార్డులు పరిశీలించాలని రైతుల వాదన. తమ పొలంలో అలుగు ఏర్పాటు చేస్తే తాము తీవ్రంగా నష్టపోతామని రైతులు అంటున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య మూడు సంవత్సరాలుగా అలుగు పంచాయితీ నడుస్తుంది. రైతులు కోర్టుకు వెళ్లడంతో కోర్టు స్టే విధించింది. ఇదిలా ఉండగా వారం రోజుల క్రితం భారీ వర్షాలు కురవడంతో అలుగు కోసం తవ్విన గుంతలో భారీ వరద నీరు చేరింది. దీంతో బ్రాహ్మణపల్లి- తొర్రూర్‌కు మధ్య రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. అలుగు పంచాయితీ మూలంగా బ్రాహ్మణపల్లికి ఆర్టీసీ బస్సు కూడా రావడం లేదని గ్రామస్థులు తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో ఎర్రకుంటకు అలుగు ఎక్కడ ఉందో తేల్చాలని గ్రామస్థులు హైడ్రా, ఇరిగేషన్ అధికారులను ఆశ్రయించారు. దీంతో హైడ్రా సీఈవో దేవేందర్‌రెడ్డి, డీఈఈ శివకృష్ణ, ఇన్‌స్పెక్టర్ తిరుమలేష్, ఇబ్రహీంపట్నం ఇరిగేషన్ డీఈఈ చెన్నకేశవరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ ఏఈ వంశీధర్‌గౌడ్ బుధవారం ఎర్రకుంటకు చేరుకున్నారు. అలుగు నీరు మరో వైపు నుంచి మళ్లించడానికి పరిశీలించారు. రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను హైడ్రా, ఇరిగేషన్ అధికారులు కోరగా సదరు పొలంపై స్టే ఉన్నందున రోడ్డు వేయలేమని తేల్చి చెప్పారు. ఎటు తేల్చుకోలేని పరిస్థితిలో ఉన్న అధికారులు పాత రికార్డులను, గ్రామ మ్యాపులను, గూగుల్ మ్యాపులను పరిశీలించి సమస్యకు పరిష్కారం చూపుతామని అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో సమస్య అలానే ఉండిపోయింది.


తొర్రూర్ ఎర్రకుంట అలుగును పరిశీలిస్తున్న హైడ్రా, ఇబ్రహీంపట్నం ఇరిగేషన్ శాఖ అధికారులు

జీఓ 99తో ఎస్సీలోని 58కులాలకు తీవ్ర అన్యాయం

- తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ
- శాసనమండలిలో చర్చించాలని తీన్మార్ మల్లన్నకు వినతి

ఎల్బీనగర్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై జీఓ 99ను ప్రవేశపెట్టి ఎస్సీలోని 59 కులాల్లో 58కులాలకు తీవ్ర అన్యాయం చేస్తోందని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ మందాల భాస్కర్, గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ బేరా బాలకిషన్‌లు పేర్కొన్నారు. ఈ అన్యాయాన్ని శాసన మండలిలో చర్చించి న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మందాల భాస్కర్, బేరా బాలకిషన్‌లు మాట్లాడుతూ గ్రూప్3లో ఉన్న మాల, మాల ఉపకులాలకు విద్యా, ఉద్యోగాల్లో 22గా సృష్టించిన రోస్టర్ పాయింట్లు 20 లోపు ఉండేలా చూడాలన్నారు. ఎస్సీలోని 58కులాలకు శాపంగా మారిన జీఓ 99ను వెంటనే సవరించి న్యాయం జరిగేలా శాసనమండలిలో చర్చించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ మల్లన్న జరుగుతున్న అన్యాయాన్ని శాసనమండలిలో తప్పకుండా చర్చించి న్యాయం చేసేందుకు తనవంతుగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ మాల యూత్ జేఏసీ అధ్యక్షుడు వీరస్వామి, విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది మాదాసు రాహుల్, మాల యూత్ జేఏసీ నాయకుడు ప్రణయ్‌కుమార్ పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు వినతిపత్రం ఇస్తున్న భాస్కర్, బాలకిషన్

రక్తదాన శిబిరం, కంటి పరీక్షలు

హయత్‌నగర్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని బుధవారం కల్వంచ శాంతినగర్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ డీవీఎస్ రామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు 50సంవత్సరాలుగా ఖాతాదారులకు సేవలు అందిస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంత రైతులకు, ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందిస్తుందని పేర్కొన్నారు. 86లక్షల మంది ఖాతాదారులకు సేవలు అందిస్తు విజయవంతంగా లాభాలు గడిస్తున్నట్లు చెప్పారు. డిపాజిట్‌లపై ఖాతాదారులకు ఇతర బ్యాంకుల కన్న అధిక వడ్డీ చెల్లిస్తున్నామని తెలిపారు. హౌసింగ్, బంగారం, వాహనాలపై రుణాలను అందించడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా దాదాపు 50మంది రక్తదానం చేశారు. శాంతినగర్‌కు చెందిన ప్రజలు కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంఓ సుమన్, కిరణ్‌సింహ, బ్రాంచ్ మేనేజర్ అశోక్‌రెడ్డి, డీఎస్ కుమార్, మాజీ కౌన్సిలర్ అనుషా రోహిత్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు ఆలూరి సందీప్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మాధవాచారి, రెడ్ క్రాస్ సొసైటీ, వాసన్ ఐకేర్, ఆరాధ్య బ్లెడ్ సెంటర్‌తో పాటు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.


రక్తదాన శిబిరంలో పాల్గొన్న గ్రామీణ బ్యాంకు సిబ్బంది

ఘనంగా బతుకమ్మ సంబరాలు

చంపాపేట : డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని ఆల్ఫర్స్ జూనియర్ కళాశాలలో విద్యార్థినులు బతుకమ్మ సంబరాలను బుధవారం ఘనంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆల్ఫర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి దుర్గామాతకు పూజలు చేసి బతుకమ్మ సంబరాలను ప్రారంభించారు. విద్యార్థినులు దాండియా, ఆట పాటలతో బతుకమ్మ వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ సరితా రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాయితేజ కోసం కొనసాగుతున్న గాలింపు

అబ్దుల్లాపూర్‌మెట్ : నగర శివారు పెద్దఅంబర్‌పేట్ ఔటర్ రింగురోడ్డు కత్వావాగులో గల్లంతైన ఇంటర్ విద్యార్థి సాయితేజ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఆదివారం స్నేహితులతో కలిసి సెల్ఫీఫోటో దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడడంతో వాగులో గల్లంతైన సంగతి తెలిసిందే. వాగులో గల్లంతై నాలుగు రోజులు అవుతున్నా అతడి ఆచూకీ ఇంకా లభించలేదు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు, రెవెన్యూ, ఇరిగేషన్, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఫైర్‌శాఖల ఆధ్వర్యంలో బోటు సహాయంతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. అయితే వాగులో వరద ప్రవాహం కూడా ఎక్కువగానే ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిసింది. అతడు జారిపడిన ప్రాంతంలోనే ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కత్వాపై నుంచి వరద నీరు ఉధృతిగా దూకుతుందని అక్కడ గాలింపు చర్యలకు ఆటంకం కలుగుతుందన్నారు. వరద ప్రవాహం తగ్గితే బయటపడే అవకాశం ఉందని పోలీసులు పేర్కొంటున్నారు.

ఊరెళ్లే వారు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి

మన్సూరాబాద్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): విజయదశమి, బతుకమ్మ పండుగలను పురస్కరించుకుని ఊరికి వెళ్లే ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ సూచించారు. బుధవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మక్బూల్ జానీ మాట్లాడుతూ పండుగ సమయాల్లో దొంగతనాలు జరిగే ఆస్కారం ఉన్నందున సొంతూళ్లకు వెళ్లే ప్రజలు ఇళ్లల్లోని బంగారు, వెండి ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులతో పాటు నగదును బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలన్నారు. ఇళ్లల్లో సీసీ కెమెరాలు, అలారం, సెంట్రల్‌లాకింగ్ వంటివి ఏర్పాటు చేసుకోవడం మేలన్నారు. పాలు పోసే వారికి, పేపర్ బాయ్స్‌కు సెలవుల సమయాల్లో రావొద్దని సూచించాలని, ప్రయాణ వివరాలు సోషల్ మీడియాలో ఉంచరాదన్నారు. తాము ఊరెళ్లే విషయాన్ని నమ్మకస్తులైన పక్కింటి వారికి, బంధువులకు చెప్పి కనిపెట్టి ఉంచాలంటూ కోరడంతో పాటు ఊరికి వెళ్లాక అప్పుడప్పుడు వారికి ఫోన్ చేసి తమ ఇంటి భద్రత వివరాలను తెలుసుకోవాలన్నారు. బస్సులు, రైళ్ల ఇతర వాహనాల్లో ఊర్లకు వెళ్లే వారు అపరిచితులు ఇచ్చే తినుబండారాలు తీసుకోరాదన్నారు. ఇలా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా చాలా వరకు దొంగతనాలు అరికట్టవచ్చన్నారు. నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రతీ ప్రాంతంలో పోలీసుల పహారా, పెట్రోలింగ్ చేయించడం జరుగుతుందని, ముఖ్యంగా రాత్రి వేళల్లో పకడ్బందీగా గస్తీ పెంచనున్నట్లు తెలిపారు. తమ తమ కాలనీల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వారిని గుర్తించి వెంటనే డయల్ 100/112కు, రాచకొండ పోలీస్ కంట్రోల్ రూమ్ నం.8712662666 లేదా వాట్సాప్ నం.8712662111 ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రాచకొండ పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు ఇప్పటికే ప్రజలందరితో ఎప్పటికప్పుడు మమేకమవుతూ చోరీలు, శాంతిభద్రతలు, నేరాల నివారణపై ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు అవగాహన కల్పిస్తూ వారిలో విశ్వాసం పెంచుతున్నామని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.


ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ

సత్యశోధక్ ఆవిర్భావ దినోత్సవం

చాదర్‌ఘాట్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో బుధవారం దిల్‌సుఖ్‌నగర్‌లో సత్యశోధక్ 152వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పీడీఎస్‌యూ పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు సరళ, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నగర కార్యదర్శి విజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజమార్పులో జ్యోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే ఎంతో కృషి చేశారని తెలిపారు. వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ నడుము కట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం జిల్లా అధ్యక్షుడు మందుల సైదులు అధ్యక్షతన జరిగింది.

బతుకమ్మ ఘాట్‌లో పనులు చేపట్టాలి

సైదాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్ ధోబీఘాట్ ఎర్రకుంట బతుకమ్మ ఘాట్‌ను యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ నేతలు ధోబీ ఘాట్ ఎర్రకుంటను పరిశీలించారు. బతుకమ్మ నిమజ్జన సమయం సమీపిస్తున్నా అధికారులు ఘాట్‌లో ఏర్పాట్లు ప్రారంభించకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎర్రకుంటను అధికారులు డంపింగ్ యార్డుగా మార్చివేశారని ఆరోపించారు. వెంటనే పూర్తిస్థాయిలో పనులు చేపట్టి బతుకమ్మ ఘాట్‌ను అందుబాటులోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నర్రి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.


ఎర్రకుంట దారిపై మట్టికుప్పలను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్

సౌటకుంటలో నిర్మాణాలపై హైడ్రా ఆరా

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ రెవెన్యూ సౌటకుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని నిర్మాణాలపై హైడ్రా ఆరా తీస్తున్నట్లు తెలిసింది. సౌటకుంట పరిధిలో వీఆర్‌సీ కన్వెన్షన్, ప్రభుత్వ భూమిలో గోదాంలను నిర్మించారని పెద్దఅంబర్‌పేట్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ గంట అనుపమలక్ష్మారెడ్డి మంగళవారం హైడ్రాకు ఫిర్యాదు చేసింది. దీంతో హైడ్రా అధికారుల ఆదేశాల మేరకు బుధవారం ఫీల్డ్ ఇన్‌స్పెక్టర్ సౌటకుంటకు వచ్చి పరిశీలించినట్లు సమాచారం. కుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధితో పాటు అందులోని నిర్మాణాలను పరిశీలించారు. ఫిర్యాదుదారు నుంచి కుంటకు సంబంధించిన మ్యాప్‌తో పాటు నిర్మాణాల ఫొటోలను, పూర్తి వివరాలను నమోదు చేసుకుని వెళ్లినట్లు తెలిసింది.

జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు అదనపు బాధ్యతలు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలోని ఎల్బీనగర్ జోన్ జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న హేమంత్ కేశవ్ పాటిల్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఉత్తర్వులు బుధవారం జారీ చేశారు. జీహెచ్‌ఎంసీలోని ఎలక్షన్స్ విభాగానికి ఆయన అడిషనల్ కమిషనర్‌గా వ్యవహరిస్తారని, ఇప్పటి వరకు ఆ స్థానంలో ఉన్న కె.అలివేలు మంగతాయారును అక్కడి నుంచి బదిలీ చేసి జీహెచ్‌ఎంసీ ఎస్టేట్ విభాగం అడిషనల్ కమిషనర్‌గా బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సంతోష్‌నగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన ఐఎస్ సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 22వ తేదీ సోమవారం ఉదయం 7.30 గంటల సమయంలో చంపాపేట లక్ష్మారెడ్డిగార్డెన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తిని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుని శరీరం పై బ్రౌన్ కలర్ ప్యాంటు, బ్రౌన్ కలర్ షర్ట్ ధరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఎస్‌ఐ మహేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి అదృశ్యం

వనస్థలిపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవులకు హాస్టల్ నుంచి ఇంటికి వచ్చిన విద్యార్థి అదృశ్యమైన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం ద్వారకామాయనగర్‌లో నివాసం ఉండే కర్నాలి అశోక్‌రెడ్డి కుమారుడు క్రాంతిక్‌రెడ్డి(13) నిజామాబాద్‌లోని బోధన్ హాస్టల్‌లో ఉంటూ 8వ తరగతి చదువుతున్నాడు. కాగా ఈనెల 19న దసరా సెలవులకు ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. క్రాంతిక్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఎంత వెతికినా అతని ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భర్తతో గొడవపడి పిల్లల్ని వదిలి భార్య..


భవాని

వనస్థలిపురం : భర్తతో గొడవపడి పిల్లల్ని వదిలేసి భార్య అదృశ్యమైన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం ద్వారకామాయనగర్‌కు చెందిన పరిసనబోయిన విద్యాసాగర్, భవాని దంపతులు తమ పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. కాగా ఈనెల 22న ఉదయం భవాని(24) తన భర్త విద్యాసాగర్‌తో గొడవపడి పిల్లల్ని వదిలేసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త విద్యాసాగర్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.